

# జాయ సేనాపతి

68 ధారావాహిక

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** ప్రత్యూషవేళ జంతుకోష్టంలో విక్రమ, ధీరలతో వ్యూహాలు రూపొందించు కుంటున్నాడు జాయపుడు. ముమ్మడి నాయకుడితో కలిసి అక్కడికి వచ్చాడు పుళిందపుడు. ముమ్మడిని జాయపకు పరిచయం చేస్తూ.. పొలవాసనాడు మండల సైన్యాధ్యక్షుని కుమారుడని చెప్పాడు. ఇటీవల కామితదేవుడితో ముమ్మడికి తగవులు పెర గడం గురించీ ప్రస్తావించాడు. మళ్లీ పుళింద పుడే.. 'ఇటీవల మీరు కూడా..' అని ఏదో చెప్ప బోతుండగా, భుజంపట్టి ఆపాడు ముమ్మడి.

"మీరు.. వాడికి వత్తాసుగా పొలవాసనాడుకు ఆడ మలయాళంతో వెళ్లడం అంత సమంజసం కాదు సేనానీ..''

దృఢంగా, కరుకుగా చెప్పాడు ముమ్మడి.

ఆయన అంత కరుకుగా చెప్పడం ఆశ్చర్యపరచింది జాయపుణ్ని. ఏమనాలో తెలియలేదు.

రాజనగరి కులీన కుర్రకారు వాగ్ధోరణి దాదాపుగా అలాగే ఉంటుంది.

మళ్లీ ముమ్మడే అన్నాడు..

''మహావీరుడని మహామండలీశ్వరులే పొగడ్తలతో ముంచెత్తుతున్నారు మిమ్మల్ని. కానీ, మీరు పోయిపోయి ఓ వేశ్యాగృహాన్ని రక్షించడానికి వచ్చారంటే..''

వ్యంగ్యంగా అర్ధోక్తిలో ఆపాడు.

పుళిందపుడు కూడా ముసిముసిగా నవ్వాడు.

కావాలని తనను రెచ్చగొట్టడానికే వచ్చినట్లుగా భావించి చివ్వున లేచాడు జాయపుడు.

అప్పుడే ధీర తొండమెత్తి దీర్ఘంగా ఘీంకరించింది. విక్రమ కోష్టం పైభాగానికి తగిలేలా ముందుకాళ్లను ఎత్తి సకిలించింది. జాయపుణ్ని ఎవరు అవమానంగా మాట్లాడినా విక్రమ, ధీర గుర్తిస్తాయి. తమ అసంతృప్తిని ఘనంగా చాటుతాయి. వాటిపై చెయ్యి వేసి నిమురుతూ అన్నాడు జాయపుడు.

''అయితే..? వెళ్లాను. అవసరం అయితే మళ్లీ వెళతాను.. అయితే??''.

''మనమంతా రాజనగరి నివాసులం. ఒకరికొకరు సహకరించుకోవాలి సేనానీ'' అన్నాడు పుళిందపుడు.

''తప్పకుండా! కానీ, అది ధర్మసమ్మతం, న్యాయ సమ్మతమైన అంశాలలో. అధికారానికి పోటీ పడేచోట నాకు న్యాయం అనిపించిన వైపు నిలుస్తాను. అయినా వేశ్యాగృహాలపైనా తమరి ప్రతాపం?'' అన్నాడు జాయపుడు వ్యంగ్యంగా.

ఉగ్రంగా చివ్వున లేచాడు ముమ్మడి. మళ్లీ అదే వేగంతో జవాబిచ్చాయి విక్రమ, ధీర.

అతణ్ని పట్టి కూర్చోబెట్టాడు జాయపుడు.

''సహాయం కోరి వచ్చినవారు సహాయాన్ని అర్థించాలి.. జబ్బలు మర్దించకూడదు!''.

సాత్వికుడుగా కనిపించే జాయపుని మాటల ఘాటు అలా ఉంటుందని ఇద్దరూ ఊహించలేదు.

అతనిలోని అసహనాన్ని అతని పెంపుడు జంతువులు ప్రదర్శిస్తున్నాయి. ఉద్వేగంతో కట్టేసిన చోట ఆగకుండా తిరుగాడుతున్నాయి. ఇద్దరూ లేచారు. కట్లు తెంచుకున్న క్రోధంతో ఉన్న ముమ్మడిని బయటికి లాక్కుపోతున్నాడు పుళిందపుడు.

కాస్త శాంతించాయి విక్రమ, ధీర.

దూరంగా వెళ్లాక పుళిందపుణ్ని విడిపించుకుని వేగంగా వెనక్కి వచ్చాడు ముమ్మడి. దగ్గరగా వచ్చి ముఖంలో ముఖం పెట్టి..

''నాతో పెట్టుకోకు.. జాయపసేనానీ!'' అన్నాడు.

పుళిందపుడు వెనక్కి వచ్చి ముమ్మడిని బలవంతంగా తీసుకుపోయాడు.

ఇలాంటి సన్నివేశాలు జాయపునికి అనుభవంలో లేవు. అతణ్ని రెచ్చగొట్టినట్లు మాట్లాడినవారు లేరు. అతను ధర్మయుద్ధంలోనే శత్రువులు అనే వాళ్లను ఎదు